

## రమణాచారిని పరామర్శించిన ఎమ్మెల్యే హరీశ్ రావు

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 18 : మోకాలి నొప్పితో బాధపడుతూ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారిని సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



నృత్య ప్రదర్శనలతో అలరించిన శ్రావణి తేనేటి శిష్య బృందం

## అలరించిన తేనేటి నృత్యం

కొండాపూర్, డిసెంబర్ 18 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న ఆల్ ఇండియా క్రాఫ్ట్స్ మేళాలో భాగంగా సోమవారం దుబాయ్ నుంచి విచ్చేసిన కూచిపూడి నృత్యకారిణి శ్రావణి తేనేటి తన శిష్య బృందంతో కలిసి కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ తంజావూరు కర్ణాటక, మధ్యప్రదేశ్‌ల జానపద నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాము

## నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్

మేడ్చల్, డిసెంబర్ 18 : సివిల్, మెకానికల్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ కీలకమని వాల్యూ లాడెన్ సంస్థ సీఈవో లావణ్య, కోనేరు లక్ష్మయ్య విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ రాము అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ ఆధ్వర్యంలో 'సొసైటల్ అప్లికేషన్ ఆఫ్ ఏఐ అండ్ ఎంఎల్ ఇన్ సివిల్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్' అనే అంశంపై సీఎస్ఐఆర్ సహకారంతో వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మెషిన్ లర్నింగ్, కృత్రిమ మేధలు కీలకంగా మారాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. వర్క్‌షాప్‌లు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి దోహదం చేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, సీఎస్ఈ హెచ్‌వోడీ ఏఐఎంఎల్ సుజిత్, సీఎస్ఈ డీన్ రామ సుబ్బారెడ్డి, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ దిలీప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

మేడ్చల్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తికానున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 8,996 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు రూ.15 కోట్ల నిధులను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేశారు. రైతులకు అందుబాటులో ఉండే విధంగా 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరో 1500 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు.

# ఫార్మాసిటీ రద్దు సరికాదు

- కందుకూరు మండలం రూపురేఖలు మారేవి
- నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేవి
- మెగాసిటీ ఏర్పాటుతో ఎవరికి లాభం
- నియోజకవర్గం అభివృద్ధికి అందరూ సహకరించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో మీర్‌ఖాన్‌పేట్ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు

కందుకూరు, డిసెంబర్ 18 : కావాలనే ఫార్మాసిటీ ప్రభుత్వం రద్దు చేస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మెగాసిటీ ఏర్పాటు చేస్తే ఎవరికి లాభమని ప్రశ్నించారు. సోమవారం కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట్ గ్రామానికి చెందిన సర్పంచ్ బ్రహ్మణపల్లి శేఖర్ గుప్తా, ఎంపీటీసీ కాకి రాములు ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మాసిటీ ఏర్పాటైతే మీర్‌ఖాన్‌పేట్ గ్రామంతో పాటు పరిసర గ్రామాల రూపురేఖలు మారేవని, పరిశ్రమల రాకతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించేవని అన్నారు. ఎంతో ముందు చూపుతో కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీని తీసుకువస్తే రాజకీయ లబ్ధి కోసం ఫార్మా సిటీని రద్దుచేయడం తగదన్నారు. మెగాసిటీ ఏర్పాటు చేస్తే ఎవరికి లభమని ప్రశ్నించారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ చేస్తున్నదని ఆరోపించారు. మీర్‌ఖాన్‌పేట్‌తో పాటు ఆకులమైలారం, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, పంజాగూడ, అన్నోజిగూడ, ఊట్లపల్లి తదితర గ్రామలను ఎంతో అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. భూములు కోల్పోయిన వారికి ఎకరాకు 121 గజాల ప్లాట్లు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశామని, అందుకోసం 600ఎకరాల్లో వెంచర్ చేసినట్లు చెప్పారు. తమ పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా ప్రజల మధ్యనే ఉంటూ పని చేస్తానని అన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సత్తయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శివప్రసాద్, చంద్రశేఖర్, అరుణ, కాకి రవి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టాలి

- రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు స్థాపించి..
- ఉద్యోగ, ఉపాధి కల్పించాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సమావేశంలో వక్తలు




సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

ఖైరతాబాద్, డిసెంబర్ 18 : రాష్ట్రంలో ఐటీకి ఢోకా లేదని, కొత్త పరిశ్రమలు స్థాపించాలని వక్తలు అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ ప్రజాస్వామిక వాదులు, జర్నలిస్టులు ఇటీవల ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసి పలు సూచనలు చేశాయని తెలిపారు. రాష్ట్రంలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నాయని, కొత్త ప్రాజెక్టులు, డ్యాములు అవసరం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని, అగ్రికల్చరల్ పాలసీ తీసుకురావాలన్నారు. నూతన పరిశ్రమలను నెలకొల్పడం ద్వారా వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించవచ్చన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాగ్వాదం కంటే ప్రజల సమస్యలపై దృష్టిపెట్టాలన్నారు. వాతావరణ కాలుష్యాన్ని నిర్మూలించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాటుపడాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు అన్నంచిని వెంకటేశ్వర్లు, కోటేశ్వర్ రావు, ఎ.శివనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సుబ్రహ్మణ్యం, హరినాథ్, అంబారాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు హెచ్‌పీఎస్‌కు రాష్ట్రపతి

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పలు విద్యా సంస్థల్లో నిర్వహించే కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆయా సంస్థల అధికారులు తెలిపారు. ఈనెల 19న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగే కార్యక్రమానికి రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు హెచ్‌పీఎస్ అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏడాది పొడుగునా జరుగుతున్న శతాబ్ది వేడుకల్లో భాగంగా మ్యూజియంను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు శాస్త్ర, సాంకేతిక ప్రయోగశాలలను సందర్శిస్తారని చెప్పారు. ఈనెల 20న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఎంఎన్ఆర్ విద్యాసంస్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్‌లో పాల్గొననున్నట్లు సంస్థ ప్రతినిధులు సోమవారం తెలిపారు. 1974లో ప్రథమంగా ఎంఎన్ఆర్ స్కూల్‌ను స్థాపించి అంచెలంచెలుగా విద్యారంగంలో ఎదిగినట్లు సంస్థ చైర్మన్ ఎంఎన్ రాజు పేర్కొన్నారు.

## జిల్లా జడ్జిని కలిసిన సీపీ సుధీర్‌బాబు






సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శశిధర్‌రెడ్డి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కె.పట్టాభిరామ్‌లను సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు కలిశారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ సరఫరా, వాటి వినియోగంపై పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరించారు.



## దాన కిశోర్‌ను కలిసిన కమిషనర్ల సంఘం

ఘట్‌కేసర్, డిసెంబర్ 18 : రాష్ట్ర పురపాలక శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దాన కిశోర్‌ను రాష్ట్ర పురపాలక సంఘాల కమిషనర్ల సంఘం ప్రతినిధులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు కృష్ణమోహన్ రెడ్డి, సెక్రెటరీ మహమూద్ సాబేర్ అలీ, సంఘం సభ్యులు ఉన్నారు.



## టీం సైన్స్ గ్రాంట్‌కు మురళీధరన్ ఎంపిక

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌కు చెందిన సైంటిస్టు డా.మురళీధరన్ భాష్యం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ఇచ్చే టీం సైన్స్ గ్రాంట్‌కు ఎంపికయ్యారు. మాలిక్యూలార్ అంకాలజీలో విభాగం సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డా.మురళి ఈ గ్రాంట్‌ను దక్కించుకున్నారు. క్యాన్సర్ కణాలపై జరుగుతున్న పరిశోధనల్లో ఈ విభాగం కీలకం పనిచేస్తుంది. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన డా.మురళి, అసోసియేషన్ ఆఫ్ యూనియన్ అగెనెస్ట్ క్యాన్సర్‌కు సభ్యుడిగా ఎంపికయ్యారు.